స్టోన్ క్రషర్లతో పరేషాన్

- పంట పొలాలను కమ్మేస్తున్న దుమ్ము
- బీడు భూములుగా మారుతున్న పంట పొలాలు
- పెచ్చుమీరుతున్న క్వారీ, క్రషర్ల యజమానులు
- కాల్వను పూడ్చివేయటంతో సరఫరా కాని సాగర్ జలాలు
- ఆవేదన చెందుతున్న రైతులు





బీడుగా మారిన పంట భూమి (ఇన్‌సెట్) లారీల నుంచి పంట పొలాల్లోకి వస్తున్న దుమ్ము

కంచికచర్ల: దొనబండ రాతి క్వారీలు, క్రషర్లు వెద జల్లే దుమ్ము వల్ల రెండు పంటలు పండే పంట పొలాలు బీడు భూములుగా మారుతున్నాయి. పంటలు సాగుచేసే సమయంలో సాగర్ కాల్వను పూడ్చటంతో సాగునీరు సరఫరా కాకపోవటంతో పంటలు ఎండిపోతున్నాయి. తమ పొలాలను అమ్ముకుని ఇతర ప్రాంతాల్లో భూములను కొనుగోలు చేద్దామనుకుంటే క్రషర్ యజమానులు తమ భూములను అమ్ముకోవద్దని బెదిరిస్తున్నారు. తమ పిల్లలను, కుటుంబాన్ని ఏవిధంగా సాకాలని రైతులు ఆందోళన చెందుతున్నారు.

450 ఎకరాల్లో పంటలపై ప్రభావం

కంచికచర్ల మండలం పరిటాల శివారు దొనబండ సమీపంలో 801 సర్వే నంబర్లలో 74 రాతి క్వారీలు, 25 క్రషర్లు ఉన్నాయి. క్వారీలు, క్రషర్ల సమీపంలో సుమారు 450 ఎకరాలు రెండు పంటలు పండే పంట భూములున్నాయి. ఆ భూముల్లో రైతులు పంటలు సాగు చేద్దామన్నా కాలుష్యం కోరల్లో చిక్కుకున్నాయి. నిత్యం వందల సంఖ్యలో లారీలకు భారీగా లోడింగ్ చేసి కంకర, మట్టి, పెద్ద పెద్ద కంకరను తరలిస్తున్నారు. దీంతో పంట పొలాల్లోకి కాలుష్యం నిరంతరం వెదజల్లుతోంది.

సాగర్ జలాలు రాకుండా కాల్వ పూడ్చివేత..

తమ పంట భూములకు నాగార్జున సాగర్ జలాలు వచ్చేవి. ఆ నీటితో మూడు దశాబ్దాల క్రితం వరకు భూముల్లో రైతులు రెండు పంటలు బాగా పండించేవారు. కానీ క్వారీ కాంట్రాక్టర్లు, క్రషర్ల యజమానులు వారి వ్యాపారం కోసం సాగర్ క్వాలలను కూడా పూడ్చివేసి రోడ్లేసుకున్నారు. దీంతో పంటలు సాగుచేసేందుకు సాగునీరు రాకపోవటంతో పంటలను సాగుచేయలేక ఏం చేయాలో పాలుపోక దిక్కులు చూస్తున్నారు.

బ్లాస్టింగ్‌తో పొలాల్లో పడుతున్న బండరాళ్లు

రాతి క్వారీలో నాణ్యతలేని నాసిరకం పేలుడు పదార్థాలను బ్లాస్టింగ్ సమయంలో వాడకం వల్ల అవి పెద్ద పెద్ద శబ్దంతో పేళుళ్లు వస్తున్నాయి. అనుభవం లేని కార్మికులచే నిబంధనలకు విరుద్ధంగా నాణ్యతాప్రమాణాలు పాటించకుండా బ్లాస్టింగ్ చేస్తున్నారు. ఆ బండరాళ్లన్నీ పొలాల్లోకి వచ్చి పడుతున్నాయి. పొలాల్లో వ్యవసాయ పనులు చేసే రైతులు, కూలీలకు తీవ్ర గాయాలయిన సంఘటనలూ ఉన్నాయి. ఇంటి గోడలు కూడా పెచ్చులూడి పడుతున్నాయి. పేలుళ్ల సమయంలో రాళ్లు లేచి జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు సైతం తీవ్ర గాయాలైన సంఘటనలు అనేకం ఉన్నాయి.

రైతులకు బెదిరింపులు..

తమ పంట పొలాలను తక్కువ ధరకు ఇవ్వాలని, లేకపోతే ఇతరులకు ఎవ్వరికి విక్రయించినా ఊరుకునేది లేదని క్వారీ కాంట్రాక్టర్లు బెదిరిస్తున్నారని రైతులు అంటున్నారు. రాజధానికి అతి సమీపంలో ఉన్న తమ పొలాలు బయట మార్కెట్‌లో ఎకరం రూ.కోటి 20 లక్షల వరకు ఉండగా, క్వారీ నిర్వాహకులు మాత్రం రూ.40 లక్షలకే ఇవ్వాలని బెదిరిస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు.

సాగర్ జలాలు రాకుండా..



సాగర్ జలాలు మూలపాడు మేజర్ కెనాల్ ద్వారా వచ్చేవి. ఆ సాగునీటితో రెండు పంటలు పండించే వాళ్లం. క్వారీ నిర్వాహకులు, యజమానులు సాగర్ కాల్వలను పూడ్చివేశారు. ఈ సమయంలో కాల్వ కట్టల మట్టిని కూడా విక్రయించుకున్నారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం ఫలితం లేకుండా పోయింది.

– ఆకుల నరసింహారావు, రైతు, పరిటాల

పొలంలో రాళ్లు పడుతున్నాయి



క్వారీల సమీపంలో తమ కుటుంబానికి నాలుగు ఎకరాల పొలం ఉంది. మూడు దశాబ్దాల క్రితం తమ పొలానికి సాగు నీరు వచ్చేది. రెండు పంటలు బాగా పండేవి. క్వారీల్లో బ్లాస్టింగ్ వల్ల బండరాళ్లు పంట పొలంలో పడిపోవటంతో పొలంలో పనిచేసే వ్యవసాయ కూలీలకు తీవ్రగాయాలవుతున్నాయి. పంట భూముల్లో వ్యవసాయ పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావటం లేదు.

– గుదే ఓంకార మురళి, రైతు, పరిటాల

ప్రభుత్వం క్రషర్లను మూసి వేయాలి



నాకు క్వారీల సమీపంలో రెండు పంటలు పండే పొలం ఉంది. కానీ ఆ పొలం సాగు చేద్దామంటే క్రషర్ల నుంచి దుమ్ము, ధూళి వెదజల్లుతోంది. దీంతో సాగుచేసిన పంటలన్నీ ఎండిపోతున్నాయి. ప్రభుత్వం వెంటనే క్రషర్లను మూసివేసి పంటలు సాగయ్యేలా చూడాలి. రైతులను ఆదుకోవాలి.

– పురమా మాధవరావు, రైతు, పరిటాల

క్లుప్తంగా

షాపుల్లో పనిచేస్తున్న విద్యార్థులకు కౌన్సెలింగ్



పెనుగంచిప్రోలు(వత్సవాయి): బడి ఈడు పిల్లలందరూ తప్పకుండా బడిలోనే ఉండాలని ఎంఈవో రవీంద్రనాయక్ తెలిపారు. శుక్రవారం పెనుగంచిప్రోలులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతమ్మ అమ్మవారి ఆలయం వద్ద బొమ్మల షాపులలో కొంతమంది విద్యార్థులు బడికి పోకుండా షాపులలో పనిచేస్తున్నారని తెలుసుకుని వారివద్దకు వెళ్లారు. బడికి పోకుండా పనికిపోరాదని, బడిఈడు ఉన్న పిల్లలను పనిలో పెట్టుకుంటే సదరు షాపు యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని తల్లిదండ్రులకు తెలియజెప్పారు. అనంతరం విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో సీఆర్పీలు జొన్నలగడ్డ గోపాలరావు, సీహెచ్ సాంబశివరావు, డి.బాబు, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవంపై అవగాహన



నందిగామ రూరల్: ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న జనాభా, దాని ప్రభావాలు, సవాళ్లు, పరిష్కారాలపై అవగాహన కల్పించడమే ప్రపంచ జనాభా దినోత్సవ ముఖ్య ఉద్దేశమని వైద్యాధికారి కామేశ్వరి పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మండలంలోని లింగాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలు, ఇద్దరు, ముగ్గురు పిల్లలున్న వారికి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఈవో బిక్షాలు, ఆశావర్కర్‌లు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న స్వామిజీ



పెనుగంచిప్రోలు(వత్సవాయి): స్థానిక గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారిని శుక్రవారం గంపలగూడెం మండలం, తోటమూల గ్రామ శ్రీశ్రీశ్రీ స్వామి వేదానంద సరస్వతి నాగబాలాజీ స్వామిజీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు స్వామిజీకి అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందించారు.

వైభవంగా నరసింహుని శాంతి కల్యాణం



వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసి యున్న యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి పవిత్రోత్సవాలలో భాగంగా శుక్రవారం పూర్ణాహుతి, శ్రీవారి శాంతి కల్యాణం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపంలో స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ అర్చకుడు వేదాంతం శ్రీధరాచార్యులు, టీటీడీ వేద విశ్వవిద్యాలయం ఆగమ పండితుడు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శాంతి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. దాదాపు మూడు గంటల పాటు కల్యాణ క్రతువులు నిర్వహించారు. ఆలయ ఈవో సురేష్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగామ రూరల్: మండలంలోని తొర్రగుడిపాడు గ్రామంలోని 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ పనుల కారణంగా మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ రూరల్ ఏఈ పూర్ణచంద్రరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. మండలంలోని పల్లగిరి, సోమవరం, రుద్రవరం, రాఘవాపురం, గోళ్లమూడి, కమ్మవారిపాలెం, మాగల్లు, కొండూరు, రామిరెడ్డిపల్లి, జొన్నలగడ్డ, దాములూరు, కొణతమాత్మకూరు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అడ్డదిడ్డంగా ఆటోలు నిలిపితే కేసులే



కంచికచర్ల: ఆటో డ్రైవర్లు ప్రయాణికుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని, ఆటోలను రోడ్లపై అడ్డదిడ్డంగా నిలిపితే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ బోనగిరి రాజు హెచ్చరించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద శుక్రవారం ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆటోలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటోల్లో గంజాయి, మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. గంజాయి సేవించే వ్యక్తులను ఆటోల్లో ఎక్కించరాదన్నారు. మద్యం తాగి ఆటోలను నడపరాదని, విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించరాదన్నారు. రాంగ్ రూట్‌లో వాహనాలను నడపొద్దని సూచించారు. మితిమీరిన వేగంతో ఆటోలు నడిపితే ప్రమాదాల బారిన పడతారని అన్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రోడ్డుకు అడ్డదిడ్డంగా ఆటోలను నిలపొద్దని హెచ్చరించారు.

వర్షంతో రైతుల హర్షం

వత్సవాయి: అన్నదాతులు వర్షం కోసం ఎదురుచూస్తున్న తరుణంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఇరవై రోజుల క్రితం నాటిన పత్తి విత్తనాలు మొలిచి వర్షం లేక ఎండుముఖం పట్టడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఈ క్రమంలో పడిన వర్షం రైతులలకు వరంగా మారింది. అంతే కాకుండా వర్షం పడడంతో పత్తి, సుబాబుల్ పంట వేసిన వాటిలో మొలవకుండా ఉన్న చోట మరలా విత్తనాలు పెడు తున్నారు. వర్షం పడడంతో ఇక రైతులు కలుపులు తీసిన పొలాల్లో మొక్కకు భూమిలో మందును పెట్టుకుని పై మందులను పిచికారీ చేసుకుంటారు. మొత్తం మీద గత పది రోజుల నుంచి ఎదురుచూస్తున్న వర్షం పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మధ్యవర్తిత్వంతో రాజీలకే మీడియేషన్ కేంద్రం

జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్



మీడియేషన్ కార్యక్రమంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి

నందిగామ టౌన్: మీడియేషన్ కేంద్రం ద్వారా రెండు వర్గాలు, కక్షిదారుల మధ్య ఉన్న అఘాదాన్ని తొలగించి మధ్యవర్తిత్వం ద్వారా రాజీ చేయటం జరుగుతుందని జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్ పేర్కొన్నారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, 16వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు ఆదేశాలతో స్థానిక కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియేషన్ కార్యక్రమంలో శుక్రవారం ఆయన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాదాస్పదమైన అంశాలను పరిశీలించి ఇరువర్గాలకు ఆమోదయోగ్యమైన రాజీ చేయటమే కార్యక్రమ ముఖ్యఉద్దేశమని తెలిపారు. దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని కేసులను పరిష్కరించుకునేందుకు అనుకూలమైన వేదికని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కన్నెకంటి జీవరత్నం, నంద్రు శ్రీరామ్మూర్తి, యరగొర్ల రామారావు, షేక్ సైదా, శెట్టి వెంకటేశ్వర్లు, మీడియేషన్ కేంద్రం ట్రినర్లు అద్దంకి మణిబాబు, కోయ దివ్య, షేక్ ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, పీహెచ్‌సీ సిబ్బంది

కంచికచర్ల: వర్షాకాలంలో వచ్చే డెంగీ, మలేరియా వంటి అంటు వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రీయ బాలల స్వాస్థ్య కార్యక్రమం ప్రోగ్రాం ఆఫీసర్ మాధవి పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం, డెంగీ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా కంచికచర్లలో శుక్రవారం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందకుండా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, జ్వరం, వాంతులు వచ్చినప్పుడు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది తరచూ ప్రజలకు తగు సూచనలు చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు, ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీఓ నానిబాబు, డాక్టర్ కే మధురిమ, హెల్త్ సూపర్‌వైజర్ జీవీ రాఘవేంద్రరావు, యూనిట్ అధికారి ఎం.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, హెల్త్ విజిటర్ బీ సారీలమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



నందిగామ గాంధీ సెంటరులో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

నందిగామ రూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించరించకుంటే శనివారం అర్ధరాత్రి నుంచి పూర్తిస్థాయి సమ్మెలోకి వెళ్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన ప్రదర్శన ఆరవ రోజుకు చేరింది. పట్టణ ప్రధాన వీధుల్లో కార్మికులు శుక్రవారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలతో పాటు అన్ని ఖర్చులు పెరుగుతున్నా కార్మికుల వేతనాలు మాత్రం పెరగటం లేదన్నారు. రోజుల తరబడి నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించటంతో పాటు కార్మికుల న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు బచ్చలకూర లాజర్, వర్కర్స్ యూనియన్ నాయకులు పరిమి రవి, సైదా, శ్రావణ్‌కుమార్, దారెల్లి అశోక్, కండెల శ్రీను, దాసు, బ్రహ్మం, కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నందిగామ రూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని లింగాలపాడు గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల పరిసరాలు, ఖాళీ ప్రదేశాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. మురుగు నీటి నిల్వల కారణంగా లార్వా అభివృద్ధి చెంది దోమల వ్యాప్తి పెరుగుతుందని తెలిపారు. మురుగు నీరు పారుదలయ్యేలా ఎప్పటికప్పుడు డ్రెయిన్‌లలో పూడిక తీత పనులను చేపట్టాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అనంతరం నీటి నిల్వ ప్రాంతాలు, డ్రెయిన్‌ల వెంబడి దోమల నియంత్రణకు ఏబేట్ మందును పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి కామేశ్వరి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు దరఖాస్తు చేసుకోవాలి

వత్సవాయి: కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులు అన్నదాత సుఖీభవ కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎవో జి.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. కొత్తగా పాసుపుస్తకం వచ్చిన రైతులు తమ పాసుపుస్తకం జిరాక్స్ ఆధార్ కార్డులను జిరాక్స్‌లతో వ్యవసాయాధికారులను సంప్రదించి పథకం కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

గండ్రాయి(జగ్గయ్యపేట): గ్రామంలోని ప్రభుత్వ భూములను శుక్రవారం నందిగామ ఆర్డీవో బాలకృష్ణ పరిశీలించారు. గత ప్రభుత్వంలో గ్రామంలో జగనన్న కాలనీలకు కేటాయించిన స్థలాలతో పాటు ప్రభుత్వం కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. పట్టణంలోని పులిచింతల సమీపంలోని జెడ్పీ స్థలాన్ని కూడా చూశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్, సర్వేయర్ అనూష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



జుజ్జూరులో వాటర్ ప్లాంట్‌ను తనిఖీ చేస్తున్న బద్రినాథ్, తదితరులు

వీరులపాడు: మినరల్ వాటర్ ప్లాంట్ యజమానులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా ఫ్లోరోసిస్ అధికారి బద్రీనాథ్ పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో మినరల్ వాటర్ సరఫరా కేంద్రాలను స్థానిక వైద్యాధికారులతో కలిసి శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా వాటర్ ప్లాంట్‌లలో మినరల్ వాటర్ తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ ప్లాంట్‌లలో టీడీఎస్ పీహెచ్ నార్మల్ రేంజ్‌లో మెయింటెయిన్ చేయాలన్నారు. ప్రతిరోజూ బ్లాక్‌వాష్ చేయటంతో పాటు తరచూ ఫిల్టర్‌లు మార్చుకోవాలని తెలిపారు. పరిశుభ్రమైన, రక్షిత మంచి నీటిని ప్రజలకు సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. వాటర్ ప్లాంట్ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను పలువురు యజమానులు ఆయనకు వివరించారు. పీహెచ్‌సీ అధికారి రవికిరణ్‌రెడ్డి, ఎంపీహెచ్ఈవో చంద్రశేఖర్, ఎంపీహెచ్ఎస్ మూర్తి, ఏఎన్ఎం జ్యోతిరాణి, వైద్యారోగ్య సిబ్బంది, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ



గోళ్లమూడిలో పార్వతీ అమ్మవారికి ఆషాఢ సారె తీసుకువస్తున్న గ్రామస్తులు, మహిళలు

నందిగామ రూరల్: మండలంలోని లింగాలపాడు గ్రామంలో లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారికి మండలంలోని తక్కెళ్లపాడు, లింగాలపాడు గ్రామాల ప్రజలు శుక్రవారం ఆషాఢ సారె సమర్పించారు. ఆయా గ్రామాలలో అమ్మవారి సారెను మంగళవాయిద్యాలు, మంత్రోచ్చరణల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారి ఆలయంలో పూజలు చేసి సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గోళ్లమూడిలో..

మండలంలోని గోళ్లమూడి గ్రామంలో గంగా పార్వతీ సమేత శంభులింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారిని ఆలయ అర్చకులు పలు రకాల కూరగాయలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. శాకంబరీ ఉత్సవాలలో భాగంగా గ్రామస్తులు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణకు ఇసుక తరలిస్తున్న లారీ స్వాధీనం



చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఏపీ నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తోట సూర్యశ్రీనివాస్ పేర్కొన్నారు. ఆయన కథనం ప్రకారం చందర్లపాడు మండలం ఏటూరు ఇసుక క్వారీ నుంచి అక్రమంగా ఇసుక తెలంగాణకు తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ క్రమంలో మండలంలోని మల్కాపురం గ్రామం వద్ద సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. టీజీ 09యూఈ 3000 నంబరు కలిగిన లారీని తనిఖీ చేయగా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. లారీ యజమాని ఖమ్మంకు చెందిన ముత్తవరపు శిఖామణి, తెలంగాణలోని రామకృష్ణాపురానికి చెందిన మోటమర్రి రవికుమార్ గత కొంత కాలంగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిసిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఇంగ్లాండ్‌కు పేట క్రికెటర్లు



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేటకు చెందిన అండర్-19 క్రికెటర్లు సత్తా చాటారు. పట్టణంలోని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ క్రికెట్ కోచ్ నిమ్మల రాజేంద్రప్రసాద్ వద్ద శిక్షణ తీసుకున్న యువ క్రీడాకారులు వరుణ్ సాత్విక్, రాజేష్ ఇంగ్లాండ్ పర్యటనకు ఎంపికయ్యారు. వెంగ్ సర్కార్ ఫౌండేషన్ దేశంలో వివిధ రాష్ట్రాల్లో మెరుగైన ప్రదర్శన చేసిన క్రీడాకారులను ఎంపిక చేసి, ఏటా పలు టోర్నీలలో పాల్గొనేలా ప్రోత్సహిస్తోంది. పేట క్రీడాకారులు పలు దేశీయ టోర్నీల్లో సత్తా చాటడంతో ఇంగ్లాండ్‌లో పలు ప్రైవేటు టోర్నీల్లో పాల్గొనేందుకు వెళ్లనున్నారు. శుక్రవారం పట్టణంలోని జీవీజే జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో ఉన్న ఇండోర్ స్టేడియం వద్ద ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) వారిని అభినందించారు. ఇంగ్లాండ్ వీసా స్టాంపింగ్ అయిన పాస్‌పోర్టులను ఎమ్మెల్యే చేతుల మీదుగా వారికి అందజేశారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, డాక్టర్ శ్రీరాం సంజయ్‌కృష్ణ, కౌన్సిలర్ పేరం సైదేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మున్సిపాల్టీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ 36 ప్రకారం వేతనాలు పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. లేకుంటే శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మె బాట పడతామని కార్మికులు హెచ్చరించారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ అర్హత, నైపుణ్యం, సర్వీసును బట్టి వేతనాలు పెంచుతామని కూటమి ప్రభుత్వ హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇంజినీరింగ్ కార్మి కుల వేతనం రూ.15 వేలు ఇస్తుంటే అందులో పీఎఫ్, ఈఎస్ఐ కటింగ్ పోను చేతికి రూ.13 వేలు వస్తున్నాయన్నారు. వారి కుటుంబాలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు శ్రీను, వాసు, శివరామకృష్ణ, దుర్గారావు పాల్గొన్నారు.

ఎస్ఐపై పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు

పెనుగంచిప్రోలు(వత్సవాయి): న్యాయం చేయ మని స్టేషన్‌కు వచ్చిన తనను ఎస్ఐ బెదిరించాడని విజయవాడ పోలీస్ కమిషనర్‌కు రైతు ఫిర్యాదు చేసిన సంఘటన శుక్రవారం జరిగింది. ఫిర్యాదుదారుడు రైతుయానాల కోటేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అనిగిండ్లపాడు గ్రామానికి చెందిన తనకు ఎకరం 90 సెంట్ల భూమి ఉందని తెలిపాడు. అయితే తన పక్కనే ఉన్న సీహెచ్ శ్రీనివాసరావు, డి.భద్రయ్యలు కలిసి తన పొలాన్ని ఆక్రమించుకోవాలని దురుద్దేశంతో పొలాన్ని దున్నారు. దీనిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మొదటిరోజు ఫిర్యాదు తీసుకుని న్యాయం చేస్తానని చెప్పిన ఎస్ఐ గ్రామంలోని కొందరు అధికారపార్టీ నాయకుల మాటలు విని బెదిరించాడని కోటేశ్వరరావు తెలిపాడు. న్యాయం చేయకపోగా నీపైనే కేసు పెడతానని బెదిరించడంతో చేసేదిలేక విజయవాడ పోలీస్ కమిషనర్‌తో పాటు నందిగామ ఏసీపీ, జగ్గయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వివరించాడు. ఫిర్యాదు కాపీలను స్థానిక విలేకరులకు అందజేశాడు.